## విజయవాడ నగర పోలీస్ కమీషనర్ కార్యాలయము

**పత్రికా ప్రకటన** **తేది.11.11.2018.**

## టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో మత్తు ఇంజక్షన్లు విక్రయించే నిందితులు

***వారి వద్ద 75 మత్తు ఇంజక్షన్లు, రూ.7,480/-ల నగదు, 4 సెల్‌ఫోన్‌లు స్వాధీనం***

విజయవాడ నగర పోలీస్ కమీషనర్ గారి ఆదేశాల మేరకు చట్ట వ్యతిరేక మరియు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేసిన కమీషనర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు వివిధ రకాల నేరగాళ్లను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఈ నేపధ్యంలో విద్యార్థులు, యువకులు మరియు కూలిపని చేస్తూ జీవనం సాగించే వారిని ఎంచుకుని వైద్యుల ప్రిస్‌కిప్షన్ లేకుండా మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తూ వారి ప్రాణాలతో చలగాటమాడుతున్న ఐదుగురు నిందితులను ది.10.11.18న టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి **30 ఎం.జి. పోర్ట్‌విన్ ఇంజక్షన్లు-75, రూ.7,480/-లు మరియు నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకోవడం జరిగింది.**

బీహార్ రాష్ట్రానికి చెందిన విశ్వరూప్ బారిక్ (36) అనే వ్యక్తి సుమారు 13 సంవత్సరాల క్రితం బ్రతుకుదెరువు నిమిత్తం విజయవాడ వచ్చి, ప్రస్తుతం గత 6 నెలలుగా అరండల్‌పేటలో నివాసం ఉంటున్నాడు. అదే ప్రాంతానికి చెందిన తంగిళ్ళ హరికృష్ణ (39) అనే వ్యక్తి ఇద్దరు కలసి గత కొంత కాలంగా 30 ఎం.జి. పోర్ట్‌విన్ పేరుతో ఉన్న మత్తు ఇంజక్షన్లు ఇతర ప్రాంతాల్లో కొనుగోలు చేసి, అరండల్‌పేట కాలువగట్టుపై నివాసం ఉంటున్న కందుకుట్ల నాగమణి (60) అనే మహిళకు విక్రయిస్తున్నారు. ఒక పోర్ట్‌విన్ ఇంజక్షన్ అసలు ధర రూ.5.30 పైసలు కాగా నాగమణికి దీనిని ఒకటి రూ.100/-లకు విక్రయిస్తుండగా, అదే ఇంజక్షన్ నాగమణి రూ.200/-లకు విక్రయిస్తుంది. నాగమణి వద్ద చిట్టినగర్‌కు చెందిన పిళ్ళా మహేష్ కుమార్ (31) మరియు పాత రాజరాజేశ్వరిపేటకు చెందిన పైడి దీపక్ (36) అనే వ్యక్తులు ఈ ఇంజక్షన్లు కొనుగోలు చేయడమే కాకుండా కొంత మంది వ్యక్తులను తీసుకువచ్చి వారితో కూడా ఈ ఇంజక్షన్లు కొనుగోలు చేయిస్తున్నారు. పోర్ట్‌విన్ ఇంజక్షన్ సాధరణంగా రోగులకు శస్త్ర చికిత్సలు చేసే సమయంలో మరియు మానసిక రోగులకు వైద్యుని పర్యవేక్షణలో మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. నిర్ధారిత వైద్యుల ప్రిస్‌కిప్షన్ లేకుండా ఈ ఇంజక్షన్‌ను విక్రయించడం మరియు కొనుగోలు చేయడం కూడా చట్టరీత్యా నేరం. ఈ మత్తు ఇంజక్షన్లుకు అలవాటుపడిన వ్యక్తులు వీటి ప్రభావం కారణంగా కొంత కాలనికి అనారోగ్యానికి గురవడమే కాకుండా ప్రాణాపాయ పరిస్థితికి వస్తారు.

గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఈ మత్తు ఇంజక్షన్ల విక్రయాలకు సంబంధించి విజయవాడ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు నిఘా ఏర్పాటు చేసి టాస్క్‌ఫోర్స్ ఏసిపి శ్రీ రాజీవ్‌కుమార్ గారి పర్యవేక్షణలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీ సురేష్ రెడ్డి గారి ఆధ్వర్యంలో చాకచక్యంగా దాడులు నిర్వహించి ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, తదుపరి దర్యాప్తు నిమిత్తం వీరిని సూర్యారావుపేట పోలీసు వారికి అప్పగించడం జరిగింది. ఈ కేసును అన్ని కోణాల్లో సమగ్రమైన విచారణ చేపట్టి మత్తు ఇంజక్షన్లను ఎక్కడ, ఎవరి నుండి కొనుగోలు చేశారో అనే వివరాలు సేకరించి మిగతా నిందితులను పట్టుకునేందుకు తగిన చర్యలు తీసుకుంటాము.

విజయవాడ నగరంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక పనుల గురించి ఎవరికైనా సమాచారం ఉన్న యెడల పోలీస్ కంట్రోల్ రూమ్ నెం. 2579999, 2576956 గాని, డయల్ 100కు గాని, 4వ లయన్ యాప్ ద్వారా గాని, విజయవాడ సిటీ పోలీస్ వాట్సప్ నంబరు 7328909090, “చేరువ” నేర నియంత్రణ అవగాహన రథం లేదా మీ దగ్గరలో ఉన్న ఇంటర్‌సెప్టర్ వాహనంలో విధులు నిర్వహిస్తు సిబ్బందికి గానీ లేదా టాస్క్‌ఫోర్స్ కార్యాలయం ల్యాండ్‌లైన్.0866 2575235కు గాని సమాచారం అందిస్తే నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని విజయవాడ పోలీస్ కమీషనర్ గారు తెలియజేయడమైనది.

-- xx --